సాక్షి
గుంటూరు

సోమవారం । 17 । ఏప్రిల్ । 2023



దేవస్థానానికి రూ.1,01,020 విరాళం

తాడేపల్లిరూరల్: కంఠంరాజు కొండూరు గ్రామంలో వేంచేసి ఉన్న మహంకాళీ అమ్మవారి దేవస్థానానికి హైదరాబాద్‌కు చెందిన నరెద్దుల శ్రీనివాసరావు దంపతులు రూ.1,01,020 అందజేశారు.



భక్తిశ్రద్ధలతో సూర్యోపాసన సేవ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): లోక కల్యాణార్థం, సర్వ మానవాళి సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షిస్తూ దుర్గమ్మ సన్నిధిలో ఆదివారం సూర్యోపాసన సేవ జరిగింది.

రెండు కరోనా కేసులు



గుంటూరు మెడికల్: జిల్లావ్యాప్తంగా ఆదివారం రెండు కరోనా కేసులు నమోదయ్యాయి. గుంటూరు నగరంలోని చంద్రమౌళినగర్, నవభారత్ నగర్‌లో ఒక్కొక్కటి చొప్పున కరోనా కేసులొచ్చాయి. జిల్లాలో ఎక్కడా కరోనా మరణాలు సంభవించలేదు.



న్యూస్‌రీల్

సాగర్ నీటిమట్టం వివరాలు

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 526.00 అడుగుల వద్ద ఉంది. ఇది 160.4430 టీఎంసీలకు సమానంగా ఉంది. సాగర్ జలాశయం నుంచి కుడికాలువకి 5,088, ఎడమకాలువకు 5,018, ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 7,840, ఎస్‌ఎల్‌బీసీకి 1,800 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. దీంతో సాగర్ జలాశయం నుంచి మొత్తం ఔట్‌ఫ్లోగా 19,746 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్ జలాశయానికి 6,510 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 804.70 అడుగుల వద్ద ఉంది. ఇది 31.3963 టీఎంసీలకు సమానం.

216 క్యూసెక్కులు విడుదల

తాడేపల్లిరూరల్(దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద ఆదివారం 216 క్యూసెక్కులు విడుదల చేశారు. బ్యాంక్ కెనాల్‌కు 58 క్యూసెక్కులు, తూర్పు కెనాల్‌కు 102 క్యూసెక్కులు, నిజాంపట్నం కాలువకు 122 క్యూసెక్కులు, కొమ్మమూరు కాల్వకు 420 క్యూసెక్కులు విడుదల చేశారు.

సంగీత పరీక్షలు



విజయవాడ కల్చరల్: దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ సంగీత కళాశాలలో ఆదివారం వార్షిక సంగీత పరీక్షలు నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ కేవీఎస్ గోవింద రాజన్ తెలిపారు. డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సులకు సంబంధించిన గాత్రం, కూచిపూడి, భరత నాట్యం, వీణ, తబల, మృదంగం అంశాలకు సంబంధించి థియరీ పరీక్షలు జంబ్లింగ్ విధానంలో నిర్వహించామన్నారు. 750 మంది పరీక్షలకు హాజరయ్యారని తెలిపారు. సోమవారం ప్రాక్టికల్స్ నిర్వహిస్తామన్నారు. పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నిర్వహించే ఫైనల్స్ జూలైలో జరిగే అవకాశం ఉందన్నారు.

నిత్యాన్నదానానికి రూ. లక్ష విరాళం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి విజయవాడ గుణదలకు చెందిన కోనేరు నాగమణి, యుగంధర్ రూ. 1,00,116ల విరాళాన్ని అందజేశారు. దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం దాతలకు చైర్మన్ కర్నాటి రాంబాబు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను బహూకరించారు.

దుర్గమ్మ సేవలో సాయిధరమ్‌తేజ్



ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): దుర్గమ్మను సినీ నటుడు సాయిధరమ్ తేజ్ ఆదివారం దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన సాయిధరమ్ తేజ్‌ను ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందజేయగా, ఆలయ అధికారులు అమ్మవారి ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

చాంబర్ ఆఫ్ కామర్స్ రాష్ట్ర కార్యవర్గం ఎన్నిక

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఎంఎస్ఎంఈ చాంబర్ ఆఫ్ కామర్స్ రాష్ట్ర నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఎంఎస్ఎంఈ చాంబర్ ఆఫ్ కామర్స్ వార్షిక సర్వసభ్య సమావేశం చైర్మన్ దాసరి దేవరాజ్, వైస్ చైర్మన్ వి. శివానంద్ అధ్యక్షతన ఎన్టీఆర్ జిల్లా విజయవాడలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యనిర్వాహక కమిటీని ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా టి.కిరణ్‌కుమార్, కార్యదర్శిగా జి.సాంబశివరావు, జాయింట్ సెక్రటరీగా ఎస్.సుబ్బారావు, కోశాధికారిగా జి.వెంకటేశ్వర్లును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నిప్పుల కుంపటి

ఇంట్లో ఉక్కపోత.. బయట ఎండ మోత.. ఉదయం తొమ్మిదింటికే మిట్ట మధ్యాహ్నం లాగా నెత్తిన సూరీడు సుర్రుమంటూ, వడగాల్పులు వీస్తూ, కాలు బయటపెట్టలేని పరిస్థితి. ఇక పదకొండు దాటితే రోడ్లపై అనధికార కర్ఫ్యూ వాతావరణమే.. టూకీగా గత పదిరోజులుగా జిల్లాలోని పరిస్థితి ఇది. పెరుగుతున్న పగటి ఉష్ణోగ్రతలు ప్రజలను తారెత్తిస్తుండగా.. తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. అయితే రాత్రి వేళ ఉష్ణోగ్రతలు కాస్తంత తగ్గుముఖం పట్టి, చల్లటి గాలులు వీయడం ఉపశమనంగా చెప్పుకోవచ్చు.



- 42 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు
- పగలు తీవ్రమైన ఎండలతో సెగలు
- అనూహ్యంగా రాత్రి ఉష్ణోగ్రతల్లో తగ్గుదల
- మండే ఎండ, వడగాల్పుల నుంచి జాగ్రత్తలు తప్పక తీసుకోవాలి

జిల్లాలో పెరిగిన వేసవితాపం



అప్రకటిత కర్ఫ్యూ.. నిర్మానుష్యంగా మారిన రెంటచింతలలోని మాచర్ల-గుంటూరు ప్రధాన రహదారి

కొరిటెపాడు(గుంటూరు): భానుడు భగభగమంటున్నాడు.. పగటి పూట తీవ్రమైన ఎండలతో సెగలు కక్కిస్తున్నాడు. అర్ధరాత్రి నుంచి వేకువ జాము వరకు కాస్తంత చల్లటి వాతావరణం ఏర్పడటం కొంతలో కొంత ఉపశమనం. అనూహ్యంగా నాలుగు రోజులుగా ఇదే పరిస్థితి నెలకొంది. గుంటూరు జిల్లావ్యాప్తంగా గత 10 రోజులుగా పగటి పూట వేసవితాపం తీవ్రస్థాయిలో కొనసాగుతోంది. ఆదివారం గుంటూరులో 42 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత రికార్డయింది. ఈ సీజన్‌లో ఇదే అత్యధిక ఉష్ణోగ్రత కావడం విశేషం. గత 15 రోజులుగా పగలు 37 నుంచి 41 డిగ్రీలు, రాత్రిళ్లు 19 నుంచి 26 డిగ్రీల మధ్య నమోదవుతున్నాయి. అయితే గత నాలుగు రోజులుగా పగటి ఉష్ణోగ్రతలు పెరిగాయి. రాత్రి ఉష్ణోగ్రతలు మాత్రం 16 నుంచి 21 డిగ్రీల మధ్య నమోదు కావడం విశేషం. దీంతో జిల్లావ్యాప్తంగా వాతావరణం మారింది. ఆదివారం తాడేపల్లి, మంగళగిరి, దుగ్గిరాల, గుంటూరు రూరల్, పెదనందిపాడు, కాకుమాను, తాడికొండ, మేడికొండూరు, తుళ్లూరు, ఫిరంగిపురం, ప్రత్తిపాడు, పెదనందిపాడు, వట్టిచెరుకూరు, కాకుమాను, పొన్నూరు, తెనాలి తదితర మండలాల్లో పగటి ఉష్ణోగ్రతలు 40 నుంచి 42 డిగ్రీల మధ్య నమోదయ్యాయి. రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ సూచించింది.

జాగ్రత్తలు తప్పనిసరి...

ఈ నెల చివరి వారం, లేదా మే నెలలో గరిష్ట ఉష్ణోగ్రత 45 డిగ్రీల వరకు నమోదయ్యే అవకాశం ఉన్నట్లు శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. భానుడి ప్రతాపానికి బెంబేలెత్తే పరిస్థితి ఉంటుందని చెబుతున్నారు. ఉదయం పదింటికే ఫ్యాన్లు, కూలర్లు, ఏసీలు వేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. తాగునీరు, మజ్జిగ, కొబ్బరి నీళ్లు, తాటిముంజలు, ఓఆర్ఎస్, ఇతరత్రా పండ్ల రసాలు ఎక్కువగా తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. అత్యవసరం అయితే తప్ప మధ్యాహ్న సమయంలో బయటకు రాకూడదని చెబుతున్నారు. వదులుగా ఉండే దుస్తులు ధరించడం, ఉప్పు, నీరు, పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవడం, రోజుకు కనీసం 7 నుంచి 8 లీటర్ల నీళ్లు తీసుకుంటే వడదెబ్బబారి నుంచి తప్పించుకోవచ్చని చెబుతున్నారు. పిల్లలు, వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు మరింత జాగ్రత్తలు పాటించాలని హెచ్చరిస్తున్నారు.



ఈ ఎండకి ఈ 'గొడుగు'...
గొడుగుల సాయంతో ఎండ నుంచి ఉపశమనం

రెంటచింతల @ 45.4

రెంటచింతల: రాష్ట్రంలోనే వేసవిలో ప్రతి ఏటా అత్యధిక ఉష్ణోగ్రత నమోదయ్యే ప్రాంతాలలో ఒకటైన రెంటచింతలలో ఏప్రిల్ నెలలోనే భగభగమంటున్న ఎండలకు ప్రజలు హడలిపోతున్నారు. ఆదివారం గరిష్ట ఉష్ణోగ్రత 45.4 డిగ్రీలు, కనిష్ట ఉష్ణోగ్రత 28.1 డిగ్రీలుగా నమోదైంది. ఇప్పటివరకు ఈ ఏడాది నమోదైన అత్యధిక ఉష్ణోగ్రత ఇదే. ఎండల తీవ్రత రోజురోజుకు పెరుగుతుండటంతో పాటు వడగాల్పులకు భయపడి ప్రజలు బయటకు రాకపోవడంతో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు కూడ గ్రామంలోని ప్రధాన వీధులన్నీ నిర్మానుష్యంగా మారాయి. రానున్న మే నెలలో ఎండల తీవ్రత ఇంకెంత పెరుగుతుందోనని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. గతంలో ఇక్కడ గరిష్ట ఉష్ణోగ్రత 49 డిగ్రీలకుపైగా నమోదైన చరిత్ర ఉంది.



నీ తెలివి చల్ల'కుండ'..
ఎండ భగభగలతో కుండలకు గిరాకీ

ప్రశాంతంగా యూపీఎస్సీ పరీక్షలు



పరీక్ష కేంద్రంలో తనిఖీ చేస్తున్న ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

పటమట(విజయవాడపశ్చిమ): యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో నగరంలో జరిగిన నేషనల్ డిఫెన్స్, నావల్ అకాడమీ, కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. నగరంలోని వివిధ కేంద్రాల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకూ పలు శాఖల సంయుక్త సహకారంతో పరీక్షలను విజయవంతంగా నిర్వహించారు. నేషనల్ డిఫెన్స్, నావల్ అకాడమీ పరీక్షలకు 1226 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 869 మంది విద్యార్థులు హాజరయ్యారు. 357 మంది గైర్హాజరయ్యారు. కాకరపర్తి భావనారాయణ కళాశాలలో రెండు కేంద్రాలు శ్రీ దుర్గామల్లేశ్వర సిద్ధార్థ మహిళ కళాశాల మరో కేంద్రంలో పరీక్ష కొనసాగింది. 104 మంది ఇన్విజిలేటర్లు, ఐదుగురు లైజన్ ఆఫీసర్లు ఎనిమిది మంది అసిస్టెంట్ సూపర్వైజర్ల విధులు నిర్వహించారు. కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ పరీక్షలను బిషప్ అజరయ్య మహిళ జూనియర్ కళాశాల, పీబీ సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో నిర్వహించారు. పరీక్ష కేంద్రాలలో 70 మంది ఇన్విజిలేటర్లు, ఇద్దరు లైజన్ ఆఫీసర్ల విధులు నిర్వహించారు. పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాలను జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు ఆదివారం తనిఖీ చేశారు. పరీక్షల వివరాలను ఇతర సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు.

మధుర ప్రస్థానం.. స్ఫూర్తిదాయకం

- దక్షిణాది రాష్ట్రాల్నుంచి ఎంపికైన ఒకే ఒక్కడు
- తన ప్రతిభను నిరూపించుకోనున్న మధుబాబు
- తెనాలి హ్యాండ్‌బాల్ అకాడమీలో సాధనతో అందిన లక్ష్యం
- ఎమ్మెల్యే శివకుమార్ అభినందన

పేదింటి కుర్రోడు.. హ్యాండ్‌బాల్ జాతీయ జట్టు గోల్ కీపర్‌గా..





స్టేడియంలో సాధన చేస్తూ... (ఇన్‌సెట్) జె.మధుబాబు

తెనాలి: స్టీలు కంపెనీలో కూలి అతడు.. భార్య వంటలు చేస్తుంటుంది.. ఇద్దరూ రెక్కలు ముక్కలు చేసుకుంటేనే ఇద్దరు పిల్లలతో కలిపి నలుగురికి రోజు గడిచేది. తమలా కాకుండా బిడ్డలిద్దరినీ చదివించాలని సంకల్పించారు. కష్టమైనా బడికి పంపుతున్నారు. చదువు వదిలేసి కొడుకు ఆటలంటూ తిరుగుతుంటే దారి తప్పుతాడేమోనని మనసు విలవిల్లాడేది. ఆటలంటే ప్రాణం పెడుతున్న కొడుకును చూసి, ఏమీ అనలేక మౌనం వహించారు. కట్ చేస్తే.. ఇప్పుడా 19 ఏళ్ల కుర్రోడు ఏకంగా భారత హ్యాండ్‌బాల్ జట్టుకు ఎంపికయ్యాడు. బల్గేరియాలో జరగనున్న మెన్స్ ఇంటర్నేషనల్ చాంపియన్‌షిప్ పోటీల్లో భారత గోల్‌కీపర్‌గా ప్రత్యర్థి జట్ల విజయావకాశాలను అడ్డుకోనున్నాడు.

నిరంతర సాధనతో..

ఆ కుర్రోడు జె.మధుబాబు. పట్టణంలోని అమరావతి ప్లాట్స్‌లోని ఇందిరా కాలనీ నివాసం. తల్లిదండ్రులు మంజుల, లక్ష్మీనారాయణ. కూలిపనులతో జీవనం గడుపుకొనే కుటుంబంలో జన్మించిన మధుబాబు, చెంచుపేటలోని కేవీఎస్ మున్సిపల్ హైస్కూలులో పదోతరగతి, తాలూకా జూనియర్ కాలేజీలో ఇంటర్ చదివాడు. ఇంటికి దగ్గర్లోనే ఏఎస్ఎన్ క్రీడాస్టేడియంకు వెళుతుండేవాడు. కోచ్ కె.నాగరాజు దగ్గర హ్యాండ్‌బాల్‌లో మెలకువలు తెలుసుకుంటూ హ్యాండ్‌బాల్ సాధన చేయసాగాడు. సబ్ జూనియర్ కేటగిరీలో ఒకసారి, జూనియర్ కేటగిరీలో మరోసారి జాతీయ హ్యాండ్‌బాల్ పోటీలకు ఆంధ్రప్రదేశ్ జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు.

దక్షిణాది నుంచి ఒకేఒక్కడు..

ఇంటర్ అయిపోయేసరికి అదే స్టేడియంలో హ్యాండ్‌బాల్ అకాడమీ అందుబాటులోకి వచ్చింది. ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ చొరవతో డబుల్ హార్స్ మినపగుళ్లు, ఇతర దాతల సౌజన్యంతో రాష్ట్ర ప్రభుత్వం స్టేడియంలో అకాడమీని ప్రవేశపెట్టింది. రాష్ట్రవ్యాప్తంగా ఎంపికచేసిన 20 మంది క్రీడాకారులకు వసతి, భోజనంతో సమకూర్చి, అక్కడే శిక్షణ ఆరంభించింది. జాతీయ జట్టుకు ఆడాలని కలలు గంటున్న మధుబాబు, డిగ్రీలో చేరలేదు. నేరుగా అకాడమీలో చేరిపోయాడు. గత ఏడాదికి ఇక్కడే నిరంతరం సాధన చేస్తూ వచ్చాడు. గత మార్చిలో వారణాసిలో నిర్వహించిన సెలక్షన్ ట్రయల్స్‌లో మధుబాబును సెలక్టర్లు రెండో ఆలోచన లేకుండా జట్టుకు ఎంపికచేశారు. భారత హ్యాండ్‌బాల్ జట్టుకు దక్షిణాది రాష్ట్రాల్నుంచి కేవలం మధుబాబు ఒక్కడే జాతీయ జట్టుకు ఎంపికవటం విశేషం. బల్గేరియా రాజధాని సోఫియాలో ఈనెల 25 నుంచి 30వ తేదీ వరకు జరగనున్న మెన్స్ ఇంటర్నేషనల్ చాంపియన్‌షిప్ పోటీల్లో భారత జట్టు గోల్‌కీపర్‌గా ఆడనున్నాడు. 5.9 అడుగుల ఎత్తు, వేగంగా కదలగల సామర్థ్యం వరాలుగా మధుబాబు ఇప్పటివరకు విజయాలను అందుకుంటూ వస్తున్నాడు.

ఎమ్మెల్యే శివకుమార్ అభినందన..



చిన్నవయసులోనే భారత జట్టుకు ఎంపికైన మధుబాబును ఆదివారం మధ్యాహ్నం తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అభినందించారు. తెనాలి ఏఎస్ఎన్ స్టేడియంలో హ్యాండ్‌బాల్ అకాడమీ ఏర్పాటు లక్ష్యం నెరవేరిందని వ్యాఖ్యానించారు. స్టేడియం నుంచి జాతీయ జట్టుకు ఎంపిక గర్వకారణమన్నారు. క్రీడా ప్రతిభతో దేశానికి, తెనాలికి మంచి పేరు తీసుకురావాలన్న ఆకాంక్షను వ్యక్తంచేశారు. అకాడమీ కోచ్ కె.నాగరాజునూ ప్రశంసించారు. వీరితో కఠారి హరీష్, మేకల రవికుమార్, సునీల్ ఉన్నారు.

వ్యాధుల సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలియజేయాలి

ప్రైవేట్ వైద్యులతో సమావేశంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రావణ్‌బాబు

గుంటూరు మెడికల్: ఆరోగ్య విధానాలు రూపొందించేందుకు, వ్యాధుల వ్యాప్తిని అరికట్టేందుకు ప్రైవేటు ఆస్పత్రులు, క్లినిక్‌లు నిర్వహిస్తున్న వైద్యులంతా తప్పనిసరిగా ఎప్పటికప్పుడు వ్యాధిగ్రస్తుల సమాచారాన్ని ఇంటిగ్రేటెడ్ హెల్త్ ఇన్ఫర్మేషన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు అన్నారు. శనివారం రాత్రి ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) గుంటూరు శాఖ ఆధ్వర్యంలో ప్రైవేటు వైద్యశాలల వైద్యులతో డాక్టర్ శ్రావణ్‌బాబు సమావేశం నిర్వహించారు. డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ ప్రైవేటు వైద్యులు వ్యాధులకు చికిత్స చేయటమే గాకుండా క్లినిక్స్, హాస్పటల్స్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ ప్రకారం మలేరియా, డెంగీ, టైఫాయిడ్, చికున్ గున్యా, డయేరియా, క్షయవంటి వ్యాధిగ్రస్తుల సమాచారాన్ని ప్రభుత్వానికి అందజేయాలన్నారు. అంటువ్యాధులు వేగంగా వ్యాప్తి చెందుతున్న ప్రస్తుత తరుణంలో ప్రభుత్వాలు వ్యాధుల నివారణ, నిరోధక చర్యలు చేపట్టేందుకు ఈ సమాచారం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రైవేటు వైద్యులు ప్రతిరోజూ తమ ఆస్పత్రులు, క్లినిక్‌ల నుంచే యాప్ ద్వారా, కంప్యూటర్‌లో వెబ్‌సైట్‌ల ద్వారా నోటిఫైడ్ వ్యాధుల గురించి సమాచారం ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ప్రతి సోమవారం జిల్లా కలెక్టర్ స్పందన కార్యక్రమంలో ప్రైవేటు వైద్యులపై అనేక ఫిర్యాదులొస్తున్నాయని వెల్లడించారు. ప్రైవేటు వైద్యులు తమ ఆస్పత్రిలో చికిత్స ఫీజు వివరాలు తెలిపే బోర్డులు పెట్టడం లేదని, ఎక్కువ ఫీజులు వసూలు చేస్తున్నారని, వైద్యులు రాసే మందులు వారి ఆస్పత్రిలోని మందుల షాపుల్లో తప్ప మరెక్కడా దొరకటం లేదని, దివ్యాంగులకు ప్రత్యేక పార్కింగ్ ప్రదేశాలు ఏర్పాటు చేయటంలేదనే ఫిర్యాదులొస్తున్నాయని చెప్పారు. ఎపిడమాలజిస్ట్ డాక్టర్ వరప్రసాద్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఇంటిగ్రేటెడ్ హెల్త్ ఇన్ఫర్మేషన్‌ను ఏ విధంగా పోర్టల్‌లో నమోదు చేయాలనే విషయాలను వివరించారు. ఐఎంఏ గుంటూరుశాఖ అధ్యక్షుడు డాక్టర్ ఆవుల శ్రీనివాస్, కార్యదర్శి డాక్టర్ వెలగా మహేష్, ఉపాధ్యక్షుడు డాక్టర్ తాతా సేవకుమార్, సంయుక్త కార్యదర్శి డాక్టర్ అమరలింగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

హామీలన్నీ నెరవేర్చిన ఏకైక సీఎం వైఎస్ జగన్


- రూ.2.08 లక్షల కోట్లను నేరుగా ప్రజల ఖాతాల్లో జమచేశారు
- మరోసారి సీఎంగా ఎన్నుకోవాల్సిన ఆవశ్యకత అందరిపై ఉంది
- 680 హామీలను ఇచ్చిన చంద్రబాబు ఏ ఒక్కటీ పూర్తిగా నెరవేర్చలేదు
- గతంలో జన్మభూమి కమిటీల పేరుతో దోచుకున్నారు
- డిప్యూటీ సీఎం అంజద్‌బాషా



డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, ఎమ్మెల్యే శివకుమార్, ఖాదర్‌బాషాలకు గజమాలతో సత్కారం

తెనాలి: భారతదేశంలో ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో 98.6 శాతం నెరవేర్చిన ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని రాష్ట్ర డిప్యూటీ సీఎం అంజద్‌బాషా అన్నారు. కులమత, పార్టీలు, వర్గాల కతీతంగా ఎలాంటి అవినీతికి ఆస్కారం లేకుండా రూ.2.08 లక్షల కోట్లను నేరుగా ప్రజల ఖాతాల్లో జమచేశారని చెప్పారు. అలాంటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని రాబోయే రోజుల్లో మరోసారి ముఖ్యమంత్రిగా ఎన్నుకోవాల్సిన ఆవశ్యకత మనందరిపై ఉందన్నారు. మహమ్మద్ రియాజ్‌ఖాన్, జేబీ జిలాని, స్టార్ గౌస్, పట్టణ ముస్లిం మైనారిటీ నాయకుల విభాగం ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి తెనాలిలో జరిగిన దువా, ఇఫ్తార్ విందులో డిప్యూటీ సీఎం అంజద్‌బాషా పాల్గొన్నారు. ముస్లిం పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. సభకు తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అధ్యక్షత వహించారు. అంజద్‌బాషా తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ, ఎన్నికల ముందు 680 హామీలనిచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబునాయుడు అయిదేళ్ల పాలనలో ఏ ఒక్క హామీని పూర్తిగా నెరవేర్చలేదని గుర్తుచేశారు. రేషను కార్డుతో సహా ఏ పని కావాలన్నా నాడు జన్మభూమి కమిటీల పేరుతో ప్రజలను దోచుకున్నారని చెప్పారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా పరిపాలన చేస్తున్న సీఎం జగన్‌మోహన్ రెడ్డి, కోవిడ్ కష్టకాలంలోనూ ప్రజలను ఆదుకుంటూ సంక్షేమాన్ని అందిస్తూ వచ్చారని చెప్పారు. సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబానికి రూ.లక్షల్లో సాయం చేసిన ముఖ్యమంత్రికి రుణపడివున్నామన్నారు. రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ ఖాదర్ బాషా మాట్లాడుతూ చంద్రబాబు హయాంలో ముస్లిం సంక్షేమానికి కేవలం రూ.2వేల కోట్లను ఖర్చుచేస్తే, జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్ల పాలనలో రూ.20,100 కోట్లను వ్యయం చేసి, అండగా నిలిచారని చెప్పారు. ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ తన ప్రసంగంలో, 98.6 శాతం హామీలను నెరవేర్చి 86.5 శాతం ప్రజలకు సంక్షేమం అందించిన వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఆదరించాలని కోరారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్, వక్ఫ్‌బోర్డు జిల్లా అధ్యక్షుడు జిలానీ బాషా, డీఎస్పీ డాక్టర్ స్రవంతిరాయ్ మాట్లాడారు. సభలో షేక్ మీరావలి, మిత్రబృందం అంజద్‌బాషాను గజమాలతో సత్కరించారు.

ఇఫ్తార్ విందుకు సర్వం సిద్ధం



స్టేడియం గ్రౌండ్‌లో ముస్తాబవుతున్న సభావేదిక

భవానీపురం(విజయవాడపశ్చిమ): పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని ముస్లింలకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున సోమవారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు సర్వం సిద్ధమైంది. గొల్లపూడి బైపాస్ రహదారిలోని విద్యాధరపురం ఆర్టీసీ డిపో పక్కనగల స్టేడియం గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరు కానున్న నేపథ్యంలో ఆదివారం సాయంత్రం సీఎం ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్, శాసనమండలి సభ్యుడు తలశిల రఘురామ్ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా యంత్రాంగం నిర్వహించిన రిహార్సల్స్‌ను తలశిల రఘురామ్ పర్యవేక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు, మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, సబ్ కలెక్టర్ అదితి సింగ్, పోలీస్ అధికారులతో ఇఫ్తార్ విందు ఏర్పాట్లపై చర్చించారు. జిల్లా గ్రీవెన్స్ అధ్యక్షుడు కేసరి కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

భద్రత ఏర్పాట్ల పరిశీలన..

ఇఫ్తార్ విందు కార్యక్రమానికి సంబంధించి భద్రతా ఏర్పాట్లను ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టి.కె. రాణా పర్యవేక్షించారు. ఇఫ్తార్ విందుకు ఏర్పాటు చేయాల్సిన కట్టుదిట్టమైన భద్రత, పటిష్ట బందోబస్తుకు తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

క్లుప్తంగా

21 నుంచి తిరునక్షత్ర మహోత్సవాలు



తెనాలి: భగవత్ రామానుచార్యులు 1006వ తిరునక్షత్ర మహోత్సవాలు, సీతారామచంద్రస్వామి వార్ల తిరు కల్యాణ మహోత్సవాలు ఈనెల 21వ తేదీ నుంచి 26 వరకు నిర్వహించనున్నట్లు నరేంద్ర రామానుజదాస స్వామి వెల్లడించారు. స్థానిక అడుసుమల్లి వారి వీధిలోని శరణాగతి గోష్టిలో ఆదివారం మహోత్సవాల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఆర్టీసీ బస్టాండు-వీఎస్సార్ కాలేజి రోడ్డులోని యర్రంశెట్టి గంగాధర్, వెంకట రమేష్ బాబు స్థల ప్రాంగణంలో ప్రతిరోజు సాయంత్రం 5.30 గంటల్నుంచి రాత్రి 8 గంటల వరకు ఉత్సవాలు జరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో విష్ణుమొలకల వాలేశ్వరరావు, తన్నీరు సీతారామయ్య, మేకల బసవయ్య, సోమరౌతు నాగేంద్రయ్య పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలు విక్రయిస్తే ఉపేక్షించేది లేదు

జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్

బాపట్ల టౌన్: మాదకద్రవ్యాలు విక్రయిస్తే ఉపేక్షించేది లేదని జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. చీరాల పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని విజిలీ పేటకు చెందిన దేవర తిరుపతయ్య అలియాస్ లడ్డూ మాదకద్రవ్యాలను విక్రయిస్తుండగా జిల్లా కలెక్టర్ ఉత్తర్వుల ప్రకారం దేవర తిరుపతయ్య అలియాస్ లడ్డూపై పీడీ యాక్ట్ అమలు చేసి రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించామన్నారు. జిల్లా ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు మొత్తం 20 మందిపై పీడీ చట్టం ప్రయోగించినట్లు చెప్పారు. జిల్లాలో మాదకద్రవ్యాల విక్రయిస్తే ఎస్పీ బాపట్ల హెల్ప్ లైన్ నంబర్ 8333813228కు, ఎస్ఈబీ టోల్ ఫ్రీ నంబర్ 14500 కు కాల్ చేసి సమాచారం అందించాలని సూచించారు.

రాష్ట్రంలో ప్రజలంతా సంతోషంగా ఉన్నారు..

- చంద్రబాబు, లోకేష్ తప్పా....
- ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు

చెరుకుపల్లి:రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ సంక్షేమ పథకాలతో సంతోషంగా ఉన్నారని, ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు ఆయన కుమారుడు లోకేష్ తప్పా అని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు పేర్కొన్నారు. ఆదివారం గుళ్లపల్లిలో విలేకర్లతో మాట్లాడారు. వైఎస్సార్ సీపీ గ్రామస్థాయి కార్యకర్త నుంచి రాష్ట్ర స్థాయి నాయకుల వరకు ఒక పక్క 'గడప గడపకు మన ప్రభుత్వం' మరో పక్క 'మా నమ్మకం నువ్వే జగన్' అంటూ ఒక పండుగ వాతావరణంలో ప్రజలతో మమేకమవుతున్నట్లు చెప్పారు. ఇప్పటి వరకు సుమారు 70 లక్షల కుటుంబాలు జగనన్నకు మద్దతు తెలిపినట్లు వివరించారు. 2024లో మరోసారి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అవుతారని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు చీరాల ప్రసాద్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు మరివాడ పావని, నాయకులు చెన్ను కోటేశ్వరరావు, పైనం ఏడుకొండలరెడ్డి, కామినేని కోటేశ్వరరావు, తూము కోటేశ్వరరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ మోపిదేవి

ఉత్తమ నాటికగా కొత్త పరిమళం

ముగిసిన పైడా కౌశిక్ నాటిక పోటీలు

మద్దిలపాలెం: దేశ సరిహద్దులో జీవన గమనంపై కళ్ల కట్టినట్టు దృశ్యావిష్కరణ చేసి.. ప్రేక్షకుల హృదయాలను కదిలించిన 'కొత్త పరిమళం'నాటిక ఉత్తమ ప్రదర్శనగా ఎంపికైంది. శ్రీకాకుళం జిల్లా బొరివంకకు చెందిన శర్వాణి గ్రామీణ గిరిజన సాంస్కృతిక సేవా సంఘం ఆధ్వర్యంలో ప్రదర్శించిన ఈ నాటిక పలు బహుమతులను కైవసం చేసుకుంది. విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన పైడా కౌశిక్ రాష్ట్ర స్థాయి నాటక పోటీలు ఆదివారంతో ముగిశాయి. ఆరు రోజుల పాటు పలు నాటికలు ప్రదర్శించగా.. విజేతలను ప్రకటించారు. 'కొత్త పరిమళం'తో హద్దులు, సరిహద్దుల్లేని ప్రపంచాన్ని భావితరాలకు అందించాలనే ఇతివృత్తంతో ప్రదర్శించిన ఈ నాటికకు ప్రేక్షకులు బ్రహ్మరథం పట్టారు. మూడో ప్రపంచ యుద్ధ భయంతో రగిలిన విద్వేషాలను నటీనటులు అద్భుతంగా ప్రదర్శించగా.. అద్భుతమైన సెట్టింగ్‌లు, వెండితెరను మరిపించేలా ఆహార్యం పోటీలకే ప్రత్యేక ఆకర్షణగా నిలిచి ఉత్తమ ప్రదర్శనగా ఎంపికైంది. ఈ నాటికకు దర్శకత్వం వహించిన బి.ఎం.ఎస్ పట్నాయిక్ ఉత్తమ దర్శకుడిగా, ఉష్మాన్‌ఖాన్ పాత్ర పోషించి బి.చలం ఉత్తమ ప్రతినాయకుడిగా ఎంపికయ్యారు. ద్వితీయ ఉత్తమ ప్రదర్శనగా ఏలూరుకు చెందిన హేళాపురి కల్చరల్ అసోసియేషన్ వారి మనసున మనసై, తృతీయ ఉత్తమ ప్రదర్శనగా గుంటూరు చెందిన అమృత థియేటర్స్ ఆర్ట్స్ వారి నాన్నా నేనొచ్చేస్తా ఎంపికయ్యాయి. ఉషోదయ కళానికేతన్ వారి ప్రక్షాళన నాటకం నాలుగో స్థానాన్ని కైవసం చేసుకుంది. జ్యూరీ ప్రదర్శనలుగా వెండి అంచులు, అనుకొని అతిథి, ప్రక్షాళన నాటికలు ఎంపికయ్యాయి. ఉత్తమ రంగాలంకరణ మనసున మనసైకు, ఉత్తమ క్యారెక్టర్ యాక్టర్‌గా ప్రయాణం నాటకంలో బసవరాజు జయశంకర్‌కు, ఉత్తమ సహాయ నటుడిగా మనసు మనసై నాటకంలో రబానీ పాత్రధారి ఎస్.శ్రీనివాసరావుకు, ఉత్తమ సంగీతంగా అభియన ఆర్ట్స్ వారి చందమామరావేకు లభించాయి. వీఎండీఏ అధ్యక్షుడు మంతెన సత్యనారాయణరాజు, కార్యదర్శి డాక్టర్ రాంబాబు, రాజ పోషకులు పైడా కృష్ణ ప్రసాద్ విజేతలకు నగదు బహుమతులతోపాటు జ్ఞాపికలు అందజేసి సత్కరించారు.



ఉత్తమ నాటిక కొత్త పరిమళం బృందానికి జ్ఞాపిక అందిస్తున్న ఎం.ఎస్.ఎన్ రాజు, రాంబాబు

చివరి ప్రదర్శనగా నాన్నా నేనొచ్చేస్తా..

పైడా కౌశిక్ నాటక పోటీల్లో ఆదివారం గుంటూరుకు చెందిన అమృత లహరి థియేటర్ ఆర్ట్స్ నాన్నా నేనొచ్చేస్తాను ప్రదర్శించారు. వీఎండీఏ అధ్యక్ష, కార్యదర్శులు ఎంఎస్ఎన్ రాజు, డాక్టర్ రాంబాబు, పైడా కృష్ణప్రసాద్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.

ఆరోగ్యానికి ట్రెక్కింగ్

- మంగళగిరి ట్రెక్కింగ్ ట్రాక్‌పై యువత ఆసక్తి
- ట్రెక్కింగ్ ట్రాక్ ద్వారా గండాలయ స్వామి కొండకు చేరుకున్న వైనం
- ఆరోగ్యం, ఆహ్లాదభరితం అంటున్న యువత


మంగళగిరి: నగర ప్రజలకు ఆరోగ్యాన్ని ఆహ్లాదాన్ని అందించేందుకు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) చొరవతో అటవీశాఖ అధికారులు మంగళగిరిలోని రెండు కొండల మధ్య ఆహ్లాదకర వాతావరణంలో గండాలయ స్వామి కొండపైకి ఏర్పాటు చేసిన ట్రెక్కింగ్ ట్రాక్ యువతను ఆకట్టుకుంటుంది. ఇప్పటికే నగరానికి చెందిన యువకులతో పాటు పలువురు ట్రెక్కింగ్ ట్రాక్ నుంచి నడక మార్గంలో గండాలయ స్వామి కొండను చేరుకుంటూ ఆహ్లాదంతో పాటు మంచి ఆరోగ్యాన్ని పొందుతున్నారు. ఎయిమ్స్ ఆసుపత్రి పక్కన పచ్చదనం కలిగిన రెండు కొండల మధ్య నిర్మించిన ఏకో పార్కు, వ్యాయామ శాల, గండాలయ స్వామి కొండపైకి వెళ్లేందుకు నిర్మించిన ట్రెక్కింగ్ ట్రాక్ పలువురికి ఆనందాన్ని, ఆహ్లాదాన్ని, ఆరోగ్యాన్ని పంచుతున్నాయి.



కొత్తగా ఏర్పాటు చేసిన హోల్ట్‌లో ఫొటోలు దిగుతూ..

విజయవాడ యువత ట్రెక్కింగ్..

ఈ నేపథ్యంలో ట్రెక్కింగ్ ట్రాక్, పార్కుల గురించి తెలుసుకున్న విజయవాడ యువత గురువారం ఉదయం ఆరుగంటలకు మంగళగిరి ఎయిమ్స్ ఆసుపత్రి వద్దకు చేరుకుని ట్రెక్కింగ్ ట్రాక్ ద్వారా గండాలయ స్వామి కొండపైకి చేరుకున్నారు. రెండు కొండల మధ్య పచ్చని ఆహ్లాదకర వాతావరణంలో ఏర్పాటు చేసిన ట్రెక్కింగ్ ట్రాక్‌తో పార్కు, గండాలయ స్వామి కొండ వెరసి మంచి అనుభూతినిచ్చిందని యువతీ యువకులు తెలిపారు. సుమారు 25 మంది యువత ఆహ్లాదంగా నడక కొనసాగించారు.



ట్రెక్కింగ్ ట్రాక్‌లో నడక కొనసాగిస్తున్న యువత

ట్రెక్కింగ్ ట్రాక్ బాగుంది..



రెండు కొండల మధ్య పచ్చని ఆహ్లాదకర వాతావరణంలో ట్రెక్కింగ్ ట్రాక్ చాలా బాగుంది. ట్రెక్కింగ్ ట్రాక్ ద్వారా గండాలయ స్వామి కొండకు చేరుకుని స్వామిని దర్శించుకోవడం ఆనందంగా వుంది. ప్రచారం నిర్వహిస్తే మంగళగిరి కొండ ప్రాంతం ఆధ్యాత్మికతతో పాటు పర్యాటకంగా అభివృద్ధి చెందే అవకాశం వుంది.

– జి.జస్వంత్, విజయవాడ అడ్వెంచర్ క్లబ్ సభ్యుడు, ట్రెక్కర్

ఆహ్లాదంతో పాటు ఆరోగ్యం..



మంగళగిరి గండాలయ స్వామి కొండకు చేరుకునేలా రెండు పచ్చని కొండల మధ్య ఆహ్లాదకర వాతావరణంలో ట్రెక్కింగ్ ట్రాక్ నిర్మాణం బాగుంది. ట్రెక్కింగ్ ట్రాక్‌లో నడక కొండ ఎక్కినట్లుగా లేదు. వాకింగ్ చేసినట్లుగా ఉండడంతో అన్ని వయస్సుల వారికి ఉపయోగపడేలా నిర్మించారు. ఆహ్లాదంతో ఆరోగ్యాన్ని అందించేలా పార్కు, ట్రెక్కింగ్ ట్రాక్ నిర్మించడం అభినందనీయం

– వి.వినయ్ కుమార్, విజయవాడ అడ్వెంచర్ క్లబ్ సభ్యుడు

వాతావరణం బాగుంది



గత కొద్ది నెలలుగా ట్రెక్కింగ్ ట్రాక్‌లలో వాకింగ్ చేస్తున్నాం. క్లబ్ సభ్యులం అవకాశం ఉన్నప్పుడల్లా కొండపల్లి ఖిల్లాతో పాటు విజయవాడ చుట్టుపక్కల ట్రెక్కింగ్ ట్రాక్‌లలో నడక కొనసాగిస్తున్నాం. మంగళగిరిలోని ట్రెక్కింగ్ ట్రాక్ రెండు కొండల మధ్య పచ్చని వాతావరణంలో చాలా బాగుంది. రానున్న రోజులలో మరింత ప్రచారం కల్పించి యువకులు ఎక్కువ మంది ట్రెక్కింగ్ నిర్వహించేలా చూస్తాం.

– సాయి శ్రీకర్, విజయవాడ అడ్వెంచర్ క్లబ్

సీఎస్ఈపీ ఏపీ, తెలంగాణ శాఖ ఏర్పాటు

లబ్బీపేట(విజయవాడ తూర్పు): కౌన్సిల్ ఆఫ్ సెక్స్ ఎడ్యుకేషన్ అండ్ పేరెంట్ హుడ్ (సీఎస్ఈపీ) ఇంటర్నేషనల్‌కు అనుబంధంగా ఏపీ, తెలంగాణ ఉమ్మడి రాష్ట్రాల శాఖను ఏర్పాటు చేశారు.

ప్రభుత్వ ఉద్యోగుల ఆరోగ్యమే ధ్యేయం

- కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి
- ముగిసిన మెగా మెడికల్ క్యాంపు

గుంటూరు వెస్ట్: ప్రతి ప్రభుత్వ ఉద్యోగి సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలనే ప్రభుత్వ లక్ష్యం జిల్లాలో చాలా వరకు నెరవేరిందని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. సీపీసీ-కంపల్సరీ హెల్త్ చెకప్‌లో భాగంగా రెండు రోజుల నుంచి స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్న మెగా మెడికల్ క్యాంపు ఆదివారం ముగిసింది. క్యాంపును పరిశీలించిన కలెక్టర్ మాట్లాడుతూ ఈ రెండు రోజులు జిల్లాలో దాదాపు 1600 మంది ప్రభుత్వ ఉద్యోగులు పరీక్షలు, వైద్యుల సలహాలు, పలు వ్యాధులకు చికిత్సలు చేయించుకున్నారని వివరించారు. గుండె, క్యాన్సర్, మూత్ర పిండాలు, గైనకాలజీ, ఆప్తమాలజీ, డెంటల్, బ్రెయిన్‌లాంటి ఎన్నో వ్యాధులకు సంబంధించి మొత్తం 8,056 పరీక్షలు నిర్వహించినట్లు చెప్పారు. ఆరోగ్యంపై నిత్యం అవగాహనతో ఉండాలని సూచించారు. ఒత్తిడిని అధిగమించేందుకు ఉద్యోగులు వారం చివర్లో ఆటవిడుపు కార్యక్రమాలు, కుటుంబంతో ఎక్కువ సమయం గడపడం చేయాలని కలెక్టర్ సూచించారు.

హెల్త్ క్యాంపు అద్భుతం

ప్రభుత్వ ఉద్యోగుల ఆరోగ్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన మెగా మెడికల్ క్యాంపు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని తలపిస్తుందని ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర అధ్యక్షులు బొప్పరాజు వెంకటేశ్వర్లు కొనియాడారు. కలెక్టర్‌తో కలసి క్యాంపును పరిశీలించిన బొప్పరాజు మాట్లాడుతూ ఉద్యోగులు ఎన్నో ఒత్తిడిలతో తల్లడిల్లిపోతున్నారన్నారు. ప్రభుత్వానికి ప్రభుత్వ ఉద్యోగులకు వారధిలా వ్యవహరిస్తున్న జిల్లా కలెక్టర్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో డీఆర్వో చంద్రశేఖరరావు, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతి, జిల్లా మెడికల్ అధికారి డాక్టర్ ఏ శ్రవణ్ బాబు, పశ్చిమ మండల తహసీల్దార్ సాంబశివరావు, ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ జయరామకృష్ణ పాల్గొన్నారు.



సంగీతరావును పరీక్షిస్తున్న విధానాన్ని తిలకిస్తున్న జిల్లా కలెక్టర్

లండన్ యూనివర్సిటీ టాపర్‌గా తారక అఖిల్



తెనాలి: పట్టణానికి చెందిన యువకుడు శింగంశెట్టి తారక అఖిల్ యూకేలోని కోవెంట్రీ యూనివర్సిటీ నుంచి డేటా సైంటిస్ట్‌గా గుడ్ ఆనర్స్ ఔట్‌స్టాండింగ్ డిగ్రీని స్వీకరించారు. స్థానిక వస్త్రవ్యాపారి హేమశ్రీనివాస్, సత్యసీతామహాలక్ష్మి కుమారుడైన తారక అఖిల్ ఇక్కడే డిగ్రీ వరకు చదువుకున్నాడు. బెంగళూరులోని జైన్ యూనివర్సిటీలో ఎంబీ చేరి యూనివర్సిటీ టాపర్లలో ఒకడిగా ఉత్తీర్ణుడయ్యాడు. హైదరాబాద్‌లోని న్యూయార్క్ స్టాక్ ఎక్చేంజ్‌లో డేటా ఎనలిస్ట్‌గా ఉద్యోగంలో చేరాడు. డేటా సైంటిస్ట్ కోర్సు చేసేందుకని అతడిని కంపెనీయే లండన్ పంపింది. అక్కడి కోవెంట్రీ యూనివర్సిటీలో చేరిన తారక అఖిల్ విజయవతంగా కోర్సును పూర్తిచేసి, ఇటీవలే ఉపకులపతి పాల్‌నూన్ చేతుల మీదుగా గుడ్ ఆనర్స్ ఔట్‌స్టాండింగ్ డిగ్రీని తీసుకున్నారు. యూనివర్సిటీ టాపర్లకు ఈ తరహాలో డిగ్రీ ఇస్తారని తారక అఖిల్ తెలిపారు.

క్రైం కార్నర్

ఏటీఎంలో ఏమార్చి..

- నగదు డ్రా చేయమని ఏటీఎంలో అజ్ఞాత వ్యక్తికి కార్డు ఇచ్చిన వైనం
- ఏటీఎం కార్డు మార్చి రూ.75 వేలు డ్రా
- వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించిన బాధితుడు




బాధితుడు కృష్ణారావు

నరసరావుపేట టౌన్: నగదు డ్రా చేసేందుకు సాయం చేయాలని అజ్ఞాత వ్యక్తిని కోరగా ఏటీఎం కార్డును మార్చి నగదు కాజేసిన ప్రబుద్ధుడి వైనం పట్టణంలో వెలుగు చూసింది. శ్రీకాకుళం జిల్లాకు చెందిన కృష్ణారావు భవన నిర్మాణ పనులు చేస్తూ పట్టణంలో నివశిస్తున్నాడు. నగదు డ్రా చేసేందుకు ఆదివారం శ్రీరాంపురం వద్ద నున్న ఏటీ ఎం వద్దకు వెళ్లాడు. అప్పటికే అక్కడ ఉన్న అజ్ఞాత వ్యక్తిని తన ఖాతాలో నగదు డ్రా చేసి ఇవ్వాలని కోరి పిన్ నంబర్ తెలిపి కార్డును అందజేశాడు. కృష్ణారావును ఆదమరిపించి కార్డును మార్చాడు మార్చిన కార్డుతో నగదు డ్రా చేసేందుకు ప్రయత్నించగా పిన్ నంబర్ తప్పుగా చూపించింది. దీంతో బ్యాంక్ కు వెళ్లి సోమవారం కలవాలని చెప్పి అక్కడ నుంచి దుండగుడు జారుకున్నాడు. కొద్ది సేపటికి కృష్ణారావు సెల్‌ఫోన్‌కు రూ.75 వేలు నగదు డ్రా అయినట్లు మెసేజ్ వచ్చింది. దీంతో కంగారు పడ్డ కృష్ణారావు తిరిగి ఏటీఎం వద్దకు వెళ్లి అక్కడ నగదు డ్రా చేసేందుకు వచ్చిన వారిని ఆరా తీశాడు. తన వద్ద ఉన్న ఏటీఎం కార్డు తనది కాదని తెలుసుకున్నాడు. ఈ మేరకు వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు.

లారీ ఢీ కొని ఒకరి దుర్మరణం

దాచేపల్లి: లారీ ఢీ కొని వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం జరిగింది. నగర పంచాయతీ పరిధిలోని ఇందిరా కాలనీ వద్ద రోడ్డు దాటుతుండగా పాలపాటి మల్లికార్జునరావు(37)ని అతివేగంగా వస్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన అతను అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు అవావివాహితుడు. సంఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మృతిచెందిన మల్లికార్జునరావు

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

బొల్లాపల్లి: అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని అయ్యన్నపాలెంలో ఆదివారం చోటుచేసుకుంది. వినుకొండ రూరల్ సీఐ యు.సుధాకర్ తెలిపిన వివరాలు... గ్రామానికి చెందిన తాటి రామయ్య అనుమానాస్పద స్థితిలో మృతిచెందారు. గ్రామసమీపంలో నెల రోజుల నుంచి మృతుడి కుటుంబం నివాసం ఉంటోంది. ఈ క్రమంలో తెల్లవారుజామున బహిర్భూమికి వెళ్లిన రామయ్య కిందపడిపోయి మృతిచెంది ఉండటంతో పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలాన్ని బండ్లమోటు ఎస్ఐ జె.బలరాంరెడ్డి పరిశీలించారు. మృతునికి భార్య మన్నెమ్మ, నలుగురు సంతానం ఉన్నారు. భార్య మన్నెమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతునికి కంటిచూపు మందగించడంతో బహిర్భూమికి వెళ్లి లోయలాంటి ప్రదేశంలో కిందపడిపోయి మృతిచెందాడని భార్య ఫిర్యాదులో పేర్కొంది. మృతుడి తరపు బంధువులు హత్యకు గురయ్యాడని ఆరోపిస్తున్నారు.



మృతుడు తాటి రామయ్య


ఉపాధ్యాయ బదిలీలు, ఉద్యోగోన్నతులు చేపట్టాలి

గుంటూరుఎడ్యుకేషన్: వేసవి సెలవుల్లోనే ఉపాధ్యాయ బదిలీలు, ఉద్యోగోన్నతులను చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్-1938) గుంటూరు జిల్లా శాఖ అధ్యక్షుడు గోవిందు వెలాంగణిరాజు ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం నగరంపాలెంలోని ఏపీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో జరిగిన సంఘ మధ్యంతర కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ బదిలీల షెడ్యూల్ విడుదల చేయాలని పేర్కొన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు కట్టిబోయిన నరసింహారావు మాట్లాడుతూ పదో తరగతి స్పాట్ వాల్యుయేషన్ విధుల్లో పాల్గొనే ఉపాధ్యాయుల రెమ్యూనరేషన్ పెంపుదల చేయాలని కోరారు. రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ విజయానంద్ మాట్లాడుతూ డీఏ బకాయిలను తక్షణమే చెల్లించాలని కోరారు. సంఘ పూర్వ అధ్యక్షుడు ఏవీ రామారావు మాట్లాడుతూ ఏపీటీఎఫ్ క్రమశిక్షణ గల సంఘమన్నారు. సమావేశంలో పూర్వ అధ్యక్షుడు కైలాష్‌నాథ్, జిల్లా సహాధ్యక్షులు పి.రమేష్, జిల్లా అదనపు కార్యదర్శి మోపిదేవి శివశంకరరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెలాంగిణి రాజు, సుబ్బారావు తదితరులు

ఈతకు వెళ్లి సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి



జయకృష్ణ (ఫైల్)

తాడేపల్లి రూరల్: నగరపాలక సంస్థ పరిధిలోని కృష్ణానది ఎగువ ప్రాంతంలో సరదాగా స్నేహితులతో ఈతకు వెళ్లి ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి నీటిలో మునిగి మృతి చెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. ఎస్ఐ వినోద్‌కుమార్ తెలిపిన వివరాలు.. విజయవాడ కృష్ణలంకకు చెందిన రిటైర్డ్ ఉద్యోగి రాజేంద్రబాబు కుమారుడు లంకా జయకృష్ణ(23) బెంగళూరులోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. లాక్‌డౌన్ దగ్గర నుంచి వర్క్ ఫ్రమ్ హోమ్ చేస్తూ ఇంటివద్దే ఉంటున్నాడు. శనివారం సాయంత్రం స్నేహితులతో కలసి కృష్ణానదికి ఈతకు వచ్చి ఉండవల్లి అమరావతి కరకట్ట వెంబడి ఎగువ ప్రాంతంలో ఉన్న పంప్‌హౌస్ వద్ద నీటిలోకి దిగాడు. ఈత రాకపోవడంతో ట్యూబ్ సహాయంతో దిగిన జయకృష్ణ కృష్ణానదిలో ఈదుతుండగా ప్రమాదవశాత్తు చేతిలో ఉన్న ట్యూబ్ జారిపోవడంతో మునిగిపోయాడు. స్నేహితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం సహాయంతో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు గాలింపు చర్యలు చేపట్టారు. జయకృష్ణ మృతదేహాన్ని పంచనామా నిమిత్తం మంగళగిరి ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

రైలు ప్రయాణికుడి ఆత్మహత్య

తెనాలి రూరల్: రైలు ప్రయాణికుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. జీఆర్పీ పోలీసుల కథనం మేరకు.. రేపల్లే- కాచిగూడ డెల్టా ఎక్స్‌ప్రెస్‌లో సుమారు 65 వయసున్న ప్రయాణికుడు శనివారం రాత్రి చినరావూరు రైల్వేస్టేషన్‌లో దిగాడు. ప్లాట్‌ఫాంపై మృతి చెంది పడి ఉండడాన్ని ఆదివారం ఉదయం స్టేషన్ సిబ్బంది గమనించి జీఆర్పీ పోలీసులకు సమాచారమిచ్చారు. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించగా మృతదేహం వెంబడి పురుగుల మందు డబ్బా, కూల్ డ్రింక్ సీసా ఉన్నాయి. పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని భావిస్తున్నారు. మృతుడి జేబులో వేమూరు నుంచి చినరావూరు వరకు తీసుకున్న టికెట్ ఉంది. వేమూరు ప్రాంతానికి చెందినవాడై ఉంటాడని భావిస్తున్నారు. జేబులో ఉన్న చిన్న క్రైస్తవ పుస్తకంలో కె.జక్రయ్య అని పేరు రాసి ఉంది. మృతదేహాన్ని తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ప్లాట్‌ఫాంపై ఉన్న మృతదేహం